క్లుప్తంగా

ఆక్రమణలు తొలగింపు



సూచిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

పుల్లంపేట : మండలంలోని కొమ్మనవారిపల్లి పంచాయతీలో సర్వే నంబర్ 734లో 9.64 ఎకరాల వంక పొరంబోకులో ఆక్రమణలను తొలగించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు బుధవారం కంచె తొలగించి సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహకుమార్, డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత



తిరుపతికి వెళ్లి వెంటశేషారెడ్డికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రెడ్డెయ్య

ఓబులవారిపల్లి : మండల పరిధిలోని చిన్నంపల్లె సచివాలయం వలంటీర్ ఏనుగుల రెడ్డెయ్య బుధవారం తన సొంత ఖర్చులతో తిరుపతికి వెళ్లి గుండు వెంకటశేషారెడ్డికి పింఛన్ అందజేశారు. చిన్నంపల్లె పంచాయతీ లింగిరెడ్డి పల్లెకు చెందిన వెంకటశేషారెడ్డి అనారోగ్యం కారణంగా కొద్ది రోజులుగా తిరుపతిలో ఉంటున్నాడు. దీంతో వలంటీర్ ఏనుగుల రెడ్డెయ్య తన సొంత ఖర్చులతో ఆర్టీసీ బస్సులో తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : ఆర్డీఓ

సంబేపల్లె : ఓటర్ల జాబితా తప్పులను సవరించే క్రమంలో బీఎల్ఓ నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ రంగస్వామి అన్నారు. బుధవారం సంబేపల్లె తహసీల్దార్ కార్యాలయంలో బూత్‌స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండల వ్యాప్తంగా ఉన్న ఓటర్ల జాబితాలో ఉన్న లోటుపాట్లను ఎంతవరకు పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత శాతం పూర్తి చేశారు అనే అంశాలపై ఆరాతీశారు. జూలై 26 నుంచి ఆగస్టు 25 వరకు ఓటర్ల జాబితాలో తప్పులు సరిదిద్దే కార్యక్రమం ఉంటుందన్నారు. తహసీల్దార్ మహేశ్వరీ బాయ్ పాల్గొన్నారు.

జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ



జగన్నన భూ శాశ్వత పత్రాలు లబ్ధిదారులకు అందజేస్తున్న తహసీల్దార్ నరసింహకుమార్

పుల్లంపేట : పుల్లంపేట మండలంలోని అనంతయ్యగారిపల్లి పంచాయతీలో బుధవారం రీసర్వే పూర్తి అయిన సందర్భంగా జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. తహసీల్దార్ నరసింహకుమార్ మాట్లాడుతూ ఈ పత్రాల ద్వారా క్రయ విక్రయాలు జరుపుకోవచ్చన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రామాలయం మండపానికి భూమిపూజ

సిద్దవటం : మండలంలోని చలమారెడ్డి కొట్టాలు గ్రామం బీసీ కాలనీలో బుధవారం రామాలయం మండపం నిర్మాణానికి భూమి పూజ చేశారు. టీడీపీ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా రాయచోటి

- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కృషితో గ్రేడ్–1 నుంచి అప్‌గ్రేడ్
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం



రాయచోటి మున్సిపల్ కార్యాలయ భవనం

రాయచోటి అర్బన్ : రాయచోటి మున్సిపాలిటీ హోదా పెరిగింది. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక కృషితో స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. రాయచోటిని గ్రేడ్–1 నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ జీఓ ఎంఎస్ నంబర్ 104 పేరుతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో గ్రేడ్–3 మున్సిపాలిటీగా ఉన్న రాయచోటిని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పట్టుపట్టి గ్రేడ్–1 చేయించారు. ప్రస్తుతం స్పెషల్‌గ్రేడ్‌గా అప్‌గ్రేడ్ చేయించారు. గ్రామపంచాయతీగా ఉన్న రాయచోటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో 2005వ సంవత్సరం ఏప్రిల్ 24న గ్రేడ్–3 మున్సిపాలిటీగా అవతరించింది. మున్సిపాలిటీ 31వార్డులుగా ఏర్పడింది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 3 ఏళ్ల క్రితం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక కృషి చేసి రాయచోటి మున్సిపాలిటీని గ్రేడ్– 3 నుంచి గ్రేడ్–1కు అప్‌గ్రేడ్ చేయించారు. వార్డులు కూడా 34కు పెరిగాయి. కొత్త జిల్లాల ఆవిర్భావం సమయంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పట్టుపట్టి మరీ రాయచోటిని జిల్లా కేంద్రంగా చేయించడం ద్వారా రాయచోటికి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపును తీసుకువచ్చారు. రాయచోటిని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్న పట్టుదలతో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో మున్సిపాలిటీని గ్రేడ్–1 నుంచి స్పెషల్‌గ్రేడ్‌గా అప్ గ్రేడ్ చేయించారు. అన్నమయ్య జిల్లాలో మదనపల్లె మున్సిపాలిటీతో సమానంగా రాయచోటి మున్సిపాలిటీ స్పెషల్‌గ్రేడ్‌గా అప్‌గ్రేడ్ కావడం పట్ల ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం రాయచోటి మున్సిపాలిటీ ఆదాయం రూ. 6 కోట్లకు పైబడి ఉంది. పట్టణంలో సుమారు లక్షా పదివేలకు పైగా జనాభా ఉంది. నిత్యం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పట్టణానికి వేల సంఖ్యలో ప్రజలు వచ్చి వెళుతుంటారు. పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ ద్వారా అందించే సేవలు, అభివృద్ధి పనులు పెరగాలంటే స్థానికంగా సమకూరే నిధులతో పాటు కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా అందజేసే నిధులు అవసరమవుతాయి. మున్సిపాలిటీలకు నిధుల కేటాయింపు, వివిధ పథకాలను అమలు పరిచే విషయంలో గ్రేడ్ –1 మున్సిపాలిటీల కంటే స్పెషల్‌గ్రేడ్ మున్సిపాలిటీలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. లక్షకు పైగా జనాభా ఉన్న రాయచోటి పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ ద్వారా మరిన్ని సౌకర్యాలు అందించేందుకు స్పెషల్‌గ్రేడ్ మున్సిపాలిటీ అప్‌గ్రేడ్ కావడం ఎంతో దోహదపడుతుంది. నిధులతో పాటు ఉద్యోగులు, సిబ్బంది పెరిగి ప్రజలకు మరిన్ని సేవలు త్వరితగతిన అందుతాయి.

శ్రీకాంత్‌రెడ్డి కృషితోనే మున్సిపాలిటీ స్థాయి పెంపు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా

రాయచోటి అర్బన్ : ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చేసిన ప్రత్యేక కృషితోనే రాయచోటి మున్సిపాలిటీ స్థాయి స్పెషల్‌గ్రేడ్‌కు పెరిగిందని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అన్నారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే విజన్ ఉన్న నాయకుడు కనుకే రాయచోటి మున్సిపాలిటీని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. శ్రీకాంత్‌రెడ్డి చూపుతున్న ప్రత్యేక చొరవతో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి దాదాపు రూ. 8.5 కోట్ల రూపాయలతో డ్రైనేజి, సిమెంటు రోడ్లను నిర్మించామన్నా రు. ఇవేకాక పట్టణంలో రూ.13.5 కోట్ల అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. మున్సిపాలిటీ స్పెషల్ గ్రేడ్‌గా అప్‌గ్రేడ్ కావడంతో మరింత ప్రగతి పథంలో పరుగులు తీస్తుందన్నారు. మున్సిపాలిటీ అప్‌గ్రేడ్ కావడం వల్ల ప్రజలపై పన్నుల భారం పెరుగుతుందనే భయాందోళనలు ఎవరూ పెట్టుకోవద్దన్నారు.

జన సంక్షేమమే జగనన్న సంకల్పం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

చిన్నమండెం : జన సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పమని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నమండెం మండలం దిగువగొట్టివీడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి ప్రారంభించారు. జంగంపల్లె, మాలపల్లె, ముండ్లవారిపల్లె, గుట్టకిందపల్లె, కురవపల్లె, అబ్బిక్కగారిపల్లె, రామాపురం, దిన్నెమీదపల్లె, ఎగువ, దిగువ బలిజపల్లెలు, దిగువగొట్టివీడు కస్బా, హరిజనవాడ, కమ్మపల్లెలలో శ్రీకాంత్‌రెడ్డి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. విరామం లేకుండా 12 గంటల పాటు ఎమ్మెల్యే గడప గడపకు తిరిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సుఖసంతోషాలే వైఎస్ఆర్ కాంగ్రెస్ పభుత్వ లక్ష్యమన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను పారదర్శకంగా సంతృప్త స్థాయిలో తమ గడప వద్దకే చేరవేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజానీకం నిండు మనసుతో ఆశీర్వదించింది. ఇంటింటికీ రెండు మూడు పథకాలు అందుతున్నాయి. జగనన్న పాలనకు వంద శాతం మార్కులను వేస్తున్నామంటూ గ్రామ ప్రజలు ఇంటింటా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి తెలిపారు. అలాగే ప్రజలు ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకురాగా వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టారు. గుట్టకిందపల్లె కురవపల్లెల్లో ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో ఎమ్మెల్యే మమేకమయ్యారు. రామాపురంలో.. చౌడేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలను శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలు నిర్వహించారు. రామాపురంలో జరిగిన కార్యక్రమంలో చేనేత కార్మికుల స్థితిగతులను మార్చి వారికి మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు జగనన్న ప్రభుత్వం వరుసగా వైఎస్ఆర్ నేతన్న నేస్తంను నాలుగో ఏడాది అందించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే ఎదుట తొగటవీర క్షత్రియులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ నరసయ్యస్వామి, సర్పంచ్ రమణ, లక్ష్మీరెడ్డి, జగన్నాథరెడ్డి, అఫ్రోజ్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి అంజనప్ప, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట): నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ సచివాలయం–2 వలంటీర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ చాంబరులో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు విధులు, బాధ్యతలను పాటించడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఎంపీడీఓ సౌభాగ్య, నాగిరెడ్డిపల్లె అర్బన్ సెక్రటరీ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు, సచివాలయాల కన్వీనర్ కలీం, వైఎస్సార్‌సీపీ నాయకులు పునగాని గుణయాదవ్, రైల్వేభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ధ్యేయం



మాట్లాడుతున్న రాజంపేట రూరల్ సీఐ పుల్లయ్య

పుల్లంపేట : శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తారని రాజంపేట రూరల్ సీఐ పుల్లయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక పుల్లంపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రఘురాంతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులకు ఎవరిపైనా వ్యక్తిగత కక్షలు, ద్వేషాలు ఉండవన్నారు. పరిస్థితులను బట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలు పరిరక్షించడమే తమ ధ్యేయమన్నారు. కొన్ని పత్రికలు పోలీసులపై అసత్య ఆరోపణలు చేయడం మంచిదికాదన్నారు. వార్తలు ప్రచురించేటప్పుడు తమను వివరణ అడిగి తెలుసుకోవాలని, అవాస్తవాలు ప్రచురిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం రాత్రి శ్రీరాములపేటలో జరిగిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అసైన్‌మెంట్ భూములు పంపిణీ చేయాలి

ఒంటిమిట్ట : మండలంలోని ఒంటిమిట్ట రెవెన్యూ భూమి సర్వే నంబర్ 2050లో ఒంటిమిట్ట, మృకుందాశ్రమం, కొత్త మాధవరం గ్రామాలకు చెందిన 150 కుటుంబాలకు చెందిన అర్హులైన పేదలకు త్వరలోనే జరగబోయే అసైన్‌మెంట్ కమిటీ సమావేశంలో ప్రభుత్వ భూమిని మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె. నరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఒంటిమిట్టలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా వారు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, గురవరాజు, వెంకటేశు, పార్వతి, అమ్ములమ్మ, ఈశ్వరమ్మ, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నీటితో చెరువు అపరిశుభ్రం



గ్రామస్తుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయారావు

ఓబులవారిపల్లె : మంగంపేట పునరావాస కాలనీ నుంచి డ్రైనేజీ నీరు గోవిందంపల్లి చెరువులో కలిసి చెరువు అపరిశుభ్రం అవుతోందని గ్రామస్తులు తెలిపారు. డ్రైనేజీ నీరు కలవకుండా చూడాలని గ్రామస్తులు కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగంపేట ఏపీఎండీసీ సీపీఓ సుదర్శన్ రెడ్డి, ఎంపీడీఓ విజయారావులు మంగంపేట, గోవిందంపల్లి సర్పంచ్‌లు, గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పునరావాస కాలనీలో ప్రతి ఇంటికీ డ్రైనేజీ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. సీపీఓ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మినుగు సుధాకర్, ఉపసర్పంచ్ కొలూరు మధుసూదన్ రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ బాలనరసింహులు, గోవిందంపల్లి సర్పంచ్ సుబ్బరత్నమ్మ, ఎంపీటీసీ రమేష్ రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులకు జరిమానా



మైనర్ బాలురకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ మహ్మద్ రఫీ

రాయచోటిటౌన్ : మైనర్ బాలురు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులకు జరిమానా విధిస్తామని ట్రాఫిక్ ఎస్ఐ మహ్మద్ రఫీ హెచ్చరించారు. బుధవారం రాయచోటి పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో వాహనాలను నడుపుతున్న మైనర్లను అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. 18 సంవత్సరాలు దాటని పిల్లలకు వాహనాలు ఇవ్వడం వలన సరైన అవగాహన లేకపోవడం, ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలియకపోవడంతో పాటు అతి వేగంగా వాహనాలు నడిపి రోడ్డుప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. మరి కొందరు శాశ్వతంగా అంగవైకల్యం పొందుతున్నారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తప్పవన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు రూ.50 వేలు విరాళం



ఎన్‌సీసీ విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న ముక్కా సాయివిశాల్‌రెడ్డి

చిట్వేలి : చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులకు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ముక్కా సాయివిశాల్‌రెడ్డి బుధవారం ముక్కావారిపల్లెలో రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ క్రమ శిక్షణకు మారు పేరన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం రెడ్డి, ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్ మాట్లాడారు. ఎన్‌సీసీ విద్యార్థులు, పాఠశాల చైర్మెన్ రెడ్డెమ్మ, ప్రధానోపాధ్యాయుడు ముక్కా రూపానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాస్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం ఆదినారాయణరెడ్డి, సీనియర్ నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ అరవ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీపై బీఎల్‌ఓలకు అవగాహన

సిద్దవటం : సిద్దవటంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఓటర్ల జాబితా తయారీపై బీఎల్‌ఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట సబ్ కలెక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీలో ముఖ్య పాత్ర బీఎల్‌ఓలదే అన్నారు. తహసీల్దార్ లక్ష్మీదేవి, ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, ఆర్ఐ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



టేక్‌హోమ్ రేషన్ కిట్లను పంపిణీ చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

సంబేపల్లె : అంగన్వాడీ కేంద్రాల ద్వారా అమలవుతున్న వైఎస్ఆర్ సంపూర్ణ పోషణతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్యం చేకూరుతుందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ సంపూర్ణపోషణ పథకంలో భాగంగా టేక్‌హోమ్ రేషన్ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి తినే వారిసంఖ్య తగ్గుతోందని గుర్తించిన ప్రభుత్వం సరుకులను టేక్‌హోమ్ పథకం ద్వారా ఇంటికే పంపించే కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ వాసుదేవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, నాగరాజు యాదవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం ప్రత్యేక చర్యలతో ఇంటివద్దకే పౌష్టికాహారం



రాజంపేట టౌన్ : మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



టేక్ హోమ్ రేషన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి

రాజంపేట టౌన్ : గర్భిణులు, బాలింతలు ఏమాత్రం ఇబ్బందులు పడకూడదన్న గొప్ప ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గర్భిణులకు అందజేసే రేషన్, పౌష్టికాహారం స్పాట్ ఫీడింగ్ విధానంలో ఇచ్చేవారన్నారు. ఈ విధానం వల్ల గర్భిణులు, బాలింతలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి టేక్‌హోమ్ రేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఎంపీడీఓ ఫణిరాజకుమారి, ఇన్‌చార్జి సీడీపీఓ టి.సరళాదేవి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ విభాగం ప్రతినిధి దాసరి పెంచలయ్య పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ ఆరోగ్యానికి రక్షణ

చిన్నమండెం : వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి రక్షణ కలుగుతుందని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. చిన్నమండెం మండలం దిగువగొట్టివీడు గ్రామంలోని రామాపురం, ఎగువ బలిజపల్లెలలో జరిగిన వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్స్ పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందన్నారు. జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు ఆదర్శంగా పనిచేయాలన్నారు. సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీరాములునాయక్, ఎంపీడీఓ రహీం పాల్గొన్నారు.

బాలింతలకు మెరుగైన ఆరోగ్యం

లక్కిరెడ్డిపల్లి : వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు మెరుగైన ఆరోగ్యం చేకూరుతుందని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ పోషణ పథకం కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి , ఉపసర్పంచ్ రాజారెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజరు పాల్గొన్నారు.

టేక్ హోమ్ రేషన్ ప్రారంభం

చిట్వేలి : టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని బుధవారం ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు పరిధిలో ఘనంగా ప్రారంభించారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరి మాట్లాడారు. ఎంపీపీ చంద్ర, ఎల్‌వీ మోహన్ రెడ్డి, ఎంపీడీఓ మహేశ్వర రెడ్డి, తహసీల్దార్ శిరీషా, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు వసుంధరమ్మ, విజయకుమారి, విశాలాక్షి, సురేఖరాణి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో పరిపూర్ణ ఆరోగ్యం

నందలూరు(రాజంపేట) : పౌష్టికాహారంతో పరిపూర్ణ ఆరోగ్యమని నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచ్ జంబుసూర్యనారాయణ అన్నారు. బుధవారం నాగిరెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో టేక్‌హోమ్ రేషన్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. గొల్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు పునగాని గుణయాదవ్ టేక్‌హోం రేషన్‌ను పంపిణీ చేశారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : పోషకాహార భద్రతకు ఒక మార్గం టేక్ హోమ్ రేషన్ అని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీడీపీఓ సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట సాయి, ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, డైరెక్టర్ గునిశెట్టి ప్రశాంతి, సీహెచ్.రమేష్, గునిశెట్టి రమేష్, కరీముల్లా, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

రామాపురం : పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రారంభించిందని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నిర్వహించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ గడికోట జనార్దన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఐసీడీసీ చైర్మన్ పద్మావతి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్ : గర్భిణులు, బాలింతలకు సీఎం సంపూర్ణ పోషణ రేషన్ అందిస్తున్నారని దిగువ అబ్బవరం సర్పంచ్ ప్రభావతమ్మ అన్నారు. నక్కవాండ్లపల్లె అంగన్ వాడీ సెంటర్‌లో టేక్‌హోం రేషన్ కిట్‌లను అందజేశారు. ఎంపీటీసీ తిరుపాల్ నాయుడు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట : రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతల కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణను తీసుకువచ్చిందని సర్పంచ్ సుజాత, ఎంపీడీఓ రెడ్డెయ్య అన్నారు. బుధవారం ఎంపీపీ కార్యాలయంలో టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కిట్లను సక్రమంగా పంపిణీ చేయాలి

గాలివీడు : ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన కిట్లను అంగన్వాడీ టీచర్లు సక్రమంగా పంపిణీ చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ యదుభూషణ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఖాదర్‌మోదీన్ సూచించారు. ఇంటికే కిట్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.